తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
శనివారం
19 సెప్టెంబర్ 2026
పేజీలు : 8
Follow :



## వారం రోజుల్లో విద్యార్థులకు
# యూనిఫాంలు అందించాలి

○ నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు
○ ఐటీడీఏ పీవో బి. రాహుల్

**భద్రాచలం సెప్టెంబర్ 18 (జనంసాక్షి)**
గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 25వ తేదీలోగా యూనిఫాంలు అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. యూనిఫాం పంపిణీలో నిర్లక్ష్యం వహించే ఏటీడీవోలు, హెచ్ఎంలు, వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు, ఏటీడీవోలు, హెచ్ఎంలు, వార్డెన్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన పీవో.. పాఠశాలల్లో యూనిఫాం పంపిణీ, మౌలిక వసతులు, విద్యాబోధన, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై సమీక్షించారు.

మిగతా 2లో

## జిల్లా కలెక్టర్‌తో టెలికాం ప్రాజెక్టులపై సమీక్ష

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి):**
భారత ప్రభుత్వం డిజిటల్ భారత్ నిధి ద్వారా చేపడుతున్న టెలికాం ప్రాజెక్టుల పురోగతి, జిల్లాలోని టెలికాం మౌలిక సదుపాయాల స్థితిగతులపై టెలికమ్యూనికేషన్స్ శాఖ, బీఎస్ఎన్ఎల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. టెలికమ్యూనికేషన్స్ శాఖ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. భాస్కరరావు, ఎన్. సత్యనారాయణలు కలెక్టర్‌ను కలిసి ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు. జిల్లాలో 16 ప్రాంతాల్లో 4జీ సాచురేషన్ ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పెండింగ్‌లో ఉందని తెలిపారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి పర్యవేక్షిస్తున్న ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూముల గుర్తింపు, కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.ప్రతి నెలా అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం తవ్వకం పనులు చేపట్టే ముందు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా కాల్ బిఫోర్ యు డిగ్ యాప్ వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రైట్ ఆఫ్ వే జీవోకు అనుగుణంగా పట్టణ స్థానిక సంస్థలు అంతర్గత అనుమతి ఉత్తర్వులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అన్ని అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో బీఎస్ఎన్ఎల్ ఏజీఎం కొత్తగూడెం సుభాష్, జేటీవోలు సందీప్, బాలకృష్ణ, సైదులు, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## తాళ్ల చెరువులో సందడి చేస్తున్న నీటి కుక్కలు

### ఆసక్తిగా తిలకించిన స్థానికులు

**గరిడేపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
గరిడేపల్లి మండల కేంద్రంలోని గరిడేపల్లి తాళ్ల చెరువులో గురువారం నీటి కుక్కలు ఒటర్లు సందడి చేశాయి. చెరువులో నీటిపై వేగంగా ఈదుతూ అప్పుడప్పుడు ఒడ్డుకు వచ్చి తిరుగుతూ కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కొందరు వాటిని సెల్ ఫోన్లలో చిత్రీకరించారు.సాధారణంగా నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో కనిపించే నీటి కుక్కలు తాజాగా గరిడేపల్లి తాళ్లచెరువు, రావి చెరువు, పొనుగోడు చెరువుల్లో కనిపించడం విశేషం. చెరువులో అనుకూలమైన నీటి వనరులు, ఆహార లభ్యత కారణంగా నీటి కుక్కలు ఇక్కడికి వచ్చినట్లు చెరువు చైర్మన్ చామకూరి దశరథ్ తెలిపారు.అరుదుగా కనిపించే ఈ వన్యప్రాణులను చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీటి సంచారానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

# మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన

○నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి
○పార్కింగ్, తాగునీరు, భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి
○అర్హత ఉన్న ప్రతి యువతకు ఉద్యోగ అవకాశం కల్పించాలి: కలెక్టర్
○వర్షాల నేపథ్యంలో వాటర్‌ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశం

**కోదాడ( జనంసాక్షి):**
కోదాడ సీసీ రెడ్డి కాన్వెంట్‌లో లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా కు సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా కలెక్టర్ సంబంధిత స్టాల్స్ ను పరిశీలించి, జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, అవసరమైతే రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేయాలని, కంపెనీల ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు అలాగే విఐపి, జాబ్ మేళా కు హాజరయ్యే వాహనాలు, అధికారుల వాహనాలకు పార్కింగ్, తాగునీరు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాల పై సూచనలు చేశారు. జాబు మేళాకు వచ్చే యువతకు వారి పక్కన వచ్చే తల్లిదండ్రులకు భోజన వసతుల లో

మిగతా 2లో



# విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

○ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి
○ ఐటీడీఏ పీఓ బి.రాహుల్



**భద్రాచలం సెప్టెంబర్ 18 (జనంసాక్షి)**
భద్రాది కొత్తగూడెం జిల్లా :- విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించి, వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు సమాజంపైనా ఉందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు.భద్రాచలంలోని గురుకులం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు బలమైన పునాది అందించేందుకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ప్రాథమిక స్థాయి నుంచే అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల, మండల, జోనల్ స్థాయిల్లో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఐటీడీఏ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్. వెంకటేశ్వర్లు, రామచందర్‌రావు, రాజా శ్రీనివాసరావు, హేమలత, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.వి. రమణతో పాటు పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి

### చండూరు పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ చేసిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

○నాణ్యమైన దర్యాప్తుతో కేసుల సత్వర పరిష్కారం
○ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలి
○నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి
○మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి



**చండూరు, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ శుక్రవారం చండూరు పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని వార్షికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రికార్డులు, సీసీటీవీ కెమెరాల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించారు. పెండింగ్ కేసులను నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లు, అలవాటుపడిన నేరస్థుల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలోని సమస్యలను సమీక్షించారు. శాంతిభద్రతల పరి రక్షణకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. తనిఖీలో నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి, చండూరు సీఐ రాము, డీసీఆర్బీ సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ శివకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

### నెక్సా షోరూమ్ లో సరికొత్త బాలెనో ఆవిష్కరణ

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేటలోని నెక్సా పవన్ మోటార్స్ షోరూమ్ లో ది స్టన్నింగ్ న్యూ బాలెనో కారున మాజీ తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి , ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జపాన్ కు సంబంధించిన కారును సంజయ్ గాంధీ ఆలోచన మేరకు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇండియాకు తీసుకురావడం అభినందనీయమన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు.అనంతరం పవన్ మోటార్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి మాట్లాడుతూ, నెక్సా అంటేనే స్టైల్, టెక్నాలజీ, సోఫిస్టికేషన్ అని అన్నారు.ఈ కొత్త బాలెనోలో అత్యాధునిక ఫీచర్లు, ప్రీమియం డిజైన్, భద్రతా ప్రమాణాలు ఉన్నాయని తెలిపారు.సూర్యాపేట వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుందని ఆశిస్తున్నామని తెలిపారుకొత్త బాలెనో డార్క్ బ్లూ షేడ్ లో ఆకర్షణీయంగా ఉండి, చూపరులను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య,మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరిశెట్టి లక్షాది, పవన్ మోటార్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి , కంపెనీ సిసివో కె.రవి రెడ్డి, విపి ఎమ్.రవీందర్, ఉమ్మడి నల్లగొండ పవన్ నెక్సా హెడ్ జానీపాషా, ఉమ్మడి నల్లగొండ హెచ్ఆర్ సిహెచ్.సుధాకర్, సూర్యాపేట బ్రాంచ్ మేనేజర్ డి.నరేష్, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణసాగర్ ఐటీఐలో వాక్ఇన్ అడ్మిషన్లు

### ఈ నెల 22 వరకు దరఖాస్తులకు అవకాశం

**బూర్గంపహాడ్ సెప్టెంబరు 18 (జనంసాక్షి)**
బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్ ప్రభుత్వ ఆర్ఐటీఐ, ఏటీసీలో 2026 ఆగస్టు సెషన్‌కు సంబంధించి మిగిలిన సీట్ల భర్తీకి వాక్ఇన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎన్సివిటి విధానంలో శిక్షణ పొందేందుకు ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐటిఐ.తెలంగాణ.జిఓవి. ఇన్ (ఇంగ్లీష్లో) వెబ్‌సైట్‌లో




దరఖాస్తు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీలో వాక్ఇన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. హాజరైన అభ్యర్థులకు మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని చెప్పారు. గతంలో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు.కృష్ణసాగర్ ఐటీఐ, ఏటీసీలో ప్రస్తుతం మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ ఒక సంవత్సరం కోర్సులో 22 సీట్లు, అడ్వాన్స్‌డ్ సిఎన్ సి మెషినింగ్ టెక్నీషియన్ రెండేళ్ల కోర్సులో ఒక సీటు, బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫయర్ రెండేళ్ల కోర్సులో 18 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ ఒక సంవత్సరం కోర్సులో 26 సీట్లు, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ ఒక సంవత్సరం కోర్సులో 5 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అభ్యర్థులు ఎస్ఎస్సీ లాంగ్ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, 1 నుంచి 10వ తరగతి బోనఫైడ్, ఐటీఐ సర్టిఫికెట్లు, టీసీ తదితర ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



### ఆడపిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారమే పునాది

### డిప్యూటీ కలెక్టర్లు అనూష, రవితేజ

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**
ఆడపిల్లల ఆరోగ్యానికి పోషకాహారం మంచి బలవర్ధకమని డిప్యూటీ కలెక్టర్లు అనూష, రవితేజ అన్నారు. అర్వపల్లిలోని కే జీ బీవీ కళాశాలలో శుక్రవారం శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రాల ఆధ్వర్యంలో భేటీ బచావో- బేటి పడావో పథకంలో భాగంగా బాలికలకు పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కౌమార దశలో బాలికలకు, శారీరకమార్పులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లల్లో రక్తం హీనత చదువుపై తీవ్ర ప్రభావం చూపుతుందని దీనిని అధిగమించడానికి ఆకు కూరలు పప్పు ధాన్యాలు, గుడ్లు, వేరుశనగలు బెల్లం లాంటి బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా బాలికలకు పోషకాహారంతో కూడిన న్యూట్రిషన్ కిట్లను పంపిణీ జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, కేజీబీవీఎస్ఓ నాగరాణి, వినోద్, భవ్య, సి ఆర్ టి లు లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నాగమణి బాధ్యతలు.

**భద్రాచలం సెప్టెంబర్ 18 (జనంసాక్షి)**
భద్రాచలంలోని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ధనసరి నాగమణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భవాని



ఆమెకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగమణి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఓ ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ నాగమణిని ఆమె ఛాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

### కులపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

### అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్

**టేకులపల్లి,, సెప్టెంబర్ 18(జనంసాక్షి):**
ఎలినేనో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున, అందులో టేకులపల్లి మండలం రైతాంగం అన్ని పంటలు ఎండిపోతున్న పరిస్థితులు కనబడుతున్నాయని, ఇప్పటికే రైతాంగం పూర్తి సంక్షోభంలో మునిగిపోయారని, టేకులపల్లి మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసిల్దారు వీరభద్రంకు వినతి పత్రాన్ని అందజేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం విధానాల వలన కరువు తీవ్రత పెరిగిందని,జూన్ నుండి నేటి వరకు పడాల్సిన సాధారణ వర్షపాతం కంటే 22.5% తక్కువగా పడిందని, సాధారణ వర్షపాతం కంటే ఆగస్టు నెలలో 37% సెప్టెంబర్ నెలలో 77% తక్కువగా పడిందని జూన్ నుండి నేటి వరకు రాష్ట్రంలో 626 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 485 మిల్లీమీటర్లు మాత్రమే కురిసిందని అఖిల భారత రైతు కూలీ సంఘం టేకులపల్లి మండల అధ్యక్షులు గుగులోత్తు రామచంద్,ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ అన్నారు. అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం టేకులపల్లి తహసిల్దార్ కార్యాలయం ముందు భూక్య నర్సింగ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించి మాట్లాడారు.వారు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40 శాతం వరకు లోటు వర్షపాతం నమోదయిందని రాష్ట్రంలో మొత్తం 621 మండలాల గాను 376 మండలాలు కరువు బారిన పడ్డాయని అన్నారు భూగర్భ జలాలు తగ్గిపోయి బావులలో బోర్లలో నీళ్లు అడుగంటుతున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టేకులపల్లి మండలాన్ని, తెలంగాణ రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి ఎట్టి నరసింహా రావు, ఏఐకేఎంఎస్ మండల నాయకులు మాజీ సర్పంచ్ భూక్య కీరియా, మేకల పొట్టయ్య,ఈసం సమ్మయ్య,సూరన్న,భాను,వెంకట్రాం బానోతు, వెంకట్రాం,నెల్లూరి నాగేశ్వరరావు,ఆంబోతు బాలు, అనంతోజు చంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన

పాటు మొబైల్ టాయిలెట్లు ఏర్పాటుచేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వర్షాలు పడే అవకాశాలు ఉన్నందువలన అవసరమైన చోట వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయాలని, జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున శాఖల వారీగా అధికారులకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు లేకుండా బాధ్యతయుతంగా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అందేలా జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోని జాబ్ మేళా ను విజయవంతం చేయాలనికలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కోదాడ, హుజుర్నగర్ ఆర్డిఓ లు సూర్యనారాయణ, శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రమాదేవి వివిధ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు

### వారం రోజుల్లో విద్యార్థులకు యూనిఫాంలు అందించాలి

యూనిఫాంల కుట్టింపు, పంపిణీ వేగవంతం చేసేందుకు ఏపీఎంలు, ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల సభ్యులను అధిక సంఖ్యలో వినియోగించాలని సూచించారు. ఏటీడీవోలు, హెచ్ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించి యూనిఫాం, ఉద్దీపకం, వారధి వర్క్‌బుక్‌ల పంపిణీతో పాటు విద్యాబోధన సక్రమంగా జరుగుతున్నదీ లేదో పరిశీలించాలని ఆదేశించారు. టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సర్దుబాటు చేయాలని సూచించారు. రిలీవ్ చేసిన ఉపాధ్యాయులు వెంటనే విధుల్లో చేరాలని, జాయిన్ కాకపోతే సెలవుగా పరిగణించి వేతనం నిలుపుదల చేయాలని ఆదేశించారు. హెచ్ఎంలు ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. పాఠశాలల తనిఖీలకు సంబంధించిన ఫొటోలను తప్పనిసరిగా గ్రూపుల్లో పోస్ట్ చేయాలని స్పష్టం చేశారు.వర్షాకాలం నేపథ్యంలో పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, విద్యార్థులు రాత్రివేళ బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే సమీప పీహెచ్‌సీకి తరలించి వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులు అందుబాటులో ఉన్నందున విద్యార్థులకు కుల, నివాస, ఆదాయ ధ్రువపత్రాలు జారీ చేయించేందుకు మీ-సేవ కేంద్రాల ద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. ఇందుకు సంబంధిత ఎమ్మార్వోలతో సమన్వయం చేసుకుని, విద్యార్థుల డాక్యుమెంటేషన్‌ను తల్లిదండ్రుల నుంచి ముందుగానే తెప్పించుకోవాలని సూచించారు. ఈ నెలలో ముఖ్యమంత్రి సమీక్ష ఉన్నందున గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో విద్యార్థులందరికీ యూనిఫాంలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పీవో రాహుల్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, ఏటీడీవోలు, హెచ్ఎంలు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

### కామేపల్లిలో నేటి నుంచి మహిళా సంఘాల అవగాహన సదస్సులు

### మండల వెలుగు ఏపీఎం యం వెంకట రామారావు

**కామేపల్లి, సెప్టెంబరు18(జనం సాక్షి):** తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారుల ఆదేశాల మేరకు కామేపల్లి మండలంలోని అజంతా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు సహాయ ప్రాజెక్టు నిర్వహణాధికారి ఎం. వెంకట రామారావు తెలిపారు.ఈ కార్యక్రమాలు సెప్టెంబరు 18 నుండి అక్టోబరు 01 వరకు మొత్తం 14 రోజుల పాటు మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు .రాష్ట్ర స్థాయి శిక్షణ వనరుల శాఖ మహిళ వ్యక్తులు టి.కవిత,కె. మమతలు గ్రామాల వారీగా పర్యటించి, సంఘాల సభ్యులకు సంఘ భావన, పంచసూత్రాల నిర్వహణ,లెక్కల పుస్తకాల నమోదు, సెర్ప్ నిబంధనలు, మొబైల్ యాప్, లోకోస్ క్రియాశీలత వంటి పరిపాలనా అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించనున్నారని తెలిపారు.

**14 రోజుల పర్యటన ప్రణాళిక వివరాలు:**
మండలంలోని 336 స్వయం సహాయక సంఘాల పరిధిలోని గ్రామ సమైక్య సంఘాలలో ఈ సదస్సులు క్రింది తేదీలలో జరుగుతాయి:
సెప్టెంబరు 18: మద్దులపల్లి (నాగజ్యోతి గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 19: లాయతండ (శ్రీ రామాంజనేయ గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 20: కామేపల్లి (విజయ గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 21: గోపాలపురం (స్వాతి గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 22: కెప్టెన్ బంజారా (వెలుగు గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 23: పూట్కూర్ (గులాబీ గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 24: పింజరమడుగు (దేవి గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 25: సూర్యతండ (రామ గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 26: ముచెర్ల (రాజమాత గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 27: జస్తిపల్లి (స్వర్ణభారతి గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 28: పొన్నేకల్ (ఆదర్శ గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 29: గార్డేపల్లి (వెన్నెల గ్రామ సమైక్య సంఘం)
సెప్టెంబరు 30: కొమ్మినేపల్లి (సదన గ్రామ సమైక్య సంఘం)
అక్టోబరు 01: కొమ్మినేపల్లి (శ్రీ చైతన్య గ్రామ సమైక్య సంఘం)
ఆయా గ్రామాల్లో నిర్ణయించిన తేదీల్లో గ్రామ సమైక్య సంఘాల ప్రతినిధులు, సభ్యులు అందరూ సమయానికి హాజరై, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ఎన్‌హెచ్‌పై ఆక్రమణలకు చెక్!

○ చేపల దుకాణాలు, లారీలతో రాకపోకలకు ఆటంకం కలిగిస్తే చర్యలు.

○ వ్యాపారాలకు అడ్డంకి కాదు.. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగితే ఉపేక్షించం.

○ సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్..

**బూర్గంపహాడ్ సెప్టెంబరు 18 (జనంసాక్షి)**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక జాతీయ రహదారిపై చేపల దుకాణాలు ఏర్పాటు చేయడం, లారీలను అడ్డంగా నిలిపి వాహన రాకపోకలకు ఇబ్బందులు కలిగించడంపై సారపాక మేజర్ గ్రామపంచాయతీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ ముఖద్వారం వైపు వెళ్లే ప్రధాన మార్గంలో రహదారిని ఆక్రమిస్తూ చేపల దుకాణాలు ఏర్పాటు చేయడం, వాహనాల దృశ్యమానతకు ఆటంకం కలిగించడం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. చేపల వ్యాపారులకు గ్రామపంచాయతీ వ్యతిరేకం కాదని సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ తెలిపారు. అయితే జాతీయ రహదారిపై నడిరోడ్డును ఆక్రమించి వ్యాపారం చేయడాన్ని అనుమతించబోమన్నారు. రహదారికి ఆనుకొని వాహన రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగని ప్రదేశాలను ఎంచుకుని వ్యాపారం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినప్పటికీ నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**మలుపుల వద్ద మరింత జాగ్రత్త**

మసీదు రోడ్డు నుంచి సెంటర్‌కు వెళ్లే మార్గంలోని మూలమలుపు వద్ద లారీలను అడ్డంగా నిలిపి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా చేయవద్దని అధికారులు సూచించారు. అదే ప్రాంతంలో చేపల దుకాణాలు ఏర్పాటు చేసి వాహనదారుల దృశ్యమానతను అడ్డుకోవద్దని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రమాదానికి దారితీసి ప్రాణనష్టానికి కారణమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**రోడ్డుపైనే పంచర్ పనులు వద్దు.**

జాతీయ రహదారిపై లారీలను నిలిపి పంచర్లు వేయడం, మరమ్మతులు చేయడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని పంచర్ దుకాణాల నిర్వాహకులకు సూచించారు. పంచర్ పనుల కోసం లారీలను వీలైనంత వరకు రహదారికి పక్కకు తీసుకెళ్లాలని, పనులు పూర్తయిన తర్వాత కూడా రహదారిపై ఎక్కువసేపు వాహనాలను నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "మీరు బతకాలి.. మీ వ్యాపారం కొనసాగాలి. కానీ ఒకరి వ్యాపారం కారణంగా మరొకరికి ఇబ్బంది కలగకూడదు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా వ్యాపారం చేయడాన్ని మాత్రం ఉపేక్షించం" అని సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ స్పష్టం చేశారు. వ్యాపారులకు గ్రామపంచాయతీ సహకరిస్తుందని, ప్రజల భద్రత విషయంలో వ్యాపారులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారపాక మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ఫంక్షన్‌హాల్.. నిర్మాణ పనుల పరిశీలన

**- రూ.1.50 కోట్లతో ఫంక్షన్‌హాల్ నిర్మాణం..**

**- పనులు వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తేవాలి..**

**- డీపీవో అనూష..**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 18 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ఐటీసీ నిధులు రూ. 1.50 కోట్లతో నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ పనులను జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీవో) అనూష శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామ ప్రజలకు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఫంక్షన్‌హాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారు రవికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ సరోజ, ఉప సర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



మొండికుంట గ్రామపంచాయతీలో డీపీఓ అనూష పర్యటన

**రికార్డులు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై పరిశీలన**

**అశ్వాపురం సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**

జిల్లా పంచాయతీ అధికారి అనూష శుక్రవారం వివిధ గ్రామపంచాయతీల పర్యటనలో భాగంగా మొండికుంట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీలించి, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం డంపింగ్ షెడ్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీపీఓ అనూషను సర్పంచ్ మర్రి సంధ్య సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, ఉపసర్పంచ్ శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంధ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా దోమల లాలయ్య

**- పార్టీ బలోపేతం, ప్రజా సంక్షేమమే లక్ష్యం**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 18 (జనంసాక్షి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- కాంగ్రెస్ పార్టీ బూర్గంపహాడ్ మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా పినపాక పట్టినగర్‌కు చెందిన దోమల లాలయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కేసుపాక రాజేష్ నియామక పత్రాన్ని అందజేశారు. గత ఎన్నికల్లో పార్టీ విజయానికి లాలయ్య అందించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు రాజేష్ తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల రమేష్, మండల అధ్యక్షుడు కేసుపాక రాజేష్‌లకు లాలయ్య కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు చేరేలా కృషి చేస్తానని లాలయ్య పేర్కొన్నారు.



తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన

## ఆహారం తయారు చేసుకోవాలి

**ఐ సి డి ఎస్ సిడిపివో నిర్మల జ్యోతి**

**కల్లూరు సెప్టెంబర్18( జనంసాక్షి)**

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అంగన్వాడీ టీచర్లు తయారుచేసి చూపించిన విధంగా చేసుకుని గర్భిణీలు, బాలింతలు తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపివో నిర్మల జ్యోతి అన్నారు. శుక్రవారం కల్లూరు మండల పరిధిలోని రఘునాథ గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో సిడిపిఓనిర్మల జ్యోతి గర్భిణీలు, బాలింతలు 6 సంవత్సరాల పిల్లల వరకు అంగన్వాడీ కేంద్రాల నుంచి ఇంటికి అందించే టి హెచ్ ఆర్ ఆహార పదార్థాలను ఉపయోగించి అంగన్వాడి టీచర్లు స్వయంగా తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె .సుధారాణి మాట్లాడుతూపోషక విలువ ప్రాముఖ్యతను , అవసరాన్ని తయారు చేసుకునే విధానాన్ని వివరించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు సంక్రమించమన్నారు.. మహిళల్లో కిషోర్ బాలికల్లో రక్తహీనత సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు , ఆహారం గురించి వివరించారు . సిడిపిఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇంటి వద్ద స్వయంగా తయారు చేసుకుని తీసుకుని రక్తహీనత సమస్యలు లేకుండా ఉండాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆరోగ్య శాఖ అందించే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణీలకు సాంప్రదాయ పద్ధతిలో చీర సారె, పూలు, పండ్లు ,గాజులు, సలిమిడితో వడి నింపి సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజ్ ర్ సుజాత,గ్రామ సర్పంచ్ సుధారానీ, ఉప సర్పంచ్ కోటేశ్వరీ, వార్డు మెంబర్ , గ్రామ పెద్దలు రానా, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్ రేవతి పద్మ, ప్రియాంక మంగమణి ,యశోద, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.




పర్యాటకులను ఆకట్టుకునేలా

## గిరిజన మ్యూజియం

○ త్వరలో అన్ని హంగులతో సరికొత్త రూపు..

○ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్

**భద్రాచలం సెప్టెంబరు 18 (జనంసాక్షి)**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా గిరిజన మ్యూజియంను అన్ని హంగులతో సుందరీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశాల మేరకు మ్యూజియం అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఐటీడీఏ యూనిట్ అధికారులతో కలిసి మ్యూజియాన్ని సందర్శించిన ఆయన.. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. మ్యూజియం ప్రాంగణంలోని బోటింగ్ పాయింట్, సెల్ఫీ పాయింట్, పెయింటింగ్ చిత్రాలు, మినీ థియేటర్‌తో పాటు ప్రవేశ ద్వారం నుంచి మ్యూజియం వరకు పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచిన గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన వస్తువులకు మెరుగులు దిద్దడంతో పాటు మరిన్ని అరుదైన వస్తువులను సేకరించాలని అన్నారు. అన్ని గదుల్లో లైటింగ్ సక్రమంగా ఉండేలా చూడాలని, విదేశీ పర్యాటకులకు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై పూర్తి సమాచారం అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించాలనుకునే మహిళా సందర్శకులకు మహిళా సిబ్బంది సహకరించాలని తెలిపారు. మ్యూజియం ప్రాంగణాన్ని సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏపీవో పవర్ వేణు, టీఏ శ్రీనివాస్, ఏవో సున్నం రాంబాబు, మేనేజర్ ఆదినారాయణ, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, సిబ్బంది కార్తీక్, సూపల్ తదితరులు పాల్గొన్నారు.

# పశువైద్యశాలకు సొంత భవనం ఎప్పుడో?

## మండల కేంద్రం నుండి పింజర మడుగు గ్రామంకు పశువైద్యశాల తరలింపుతో రైతుల్లో ఆందోళన

కామేపల్లి,సెప్టెంబర్ 18 (జనంసాక్షి)
మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాల భవనం తీవ్రంగా శిథిలావస్థకు చేరడంతో,దానిని శుక్రవారం పింజరమడుగులోని గోపాలమిత్ర భవనానికి తాత్కాలికంగా తరలించారు.పాత భవనం ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉండటంతోనే ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని అధికారులు స్పష్టం చేశారు. ?నూతన భవన నిర్మాణం కోసం ఎన్నిసార్లు స్థానిక ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య.స్థానిక తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్ రెడ్డి మండల ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పాలకుల నుంచి ఎటువంటి స్పందన కరువైందని, దీంతో చేసేది లేక ఆసుపత్రిని తరలించాల్సి వచ్చిందని తెలుస్తోంది. అయితే, పశువైద్యశాలను దూరంగా తరలించడంతో ఇటు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్యసేవలు అందక మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.











## కూలీలైన్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

### భోజనంలో పౌష్టికాహారం అందించాలని ఆదేశం



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (జనం సాక్షి):** పీ.ఎంశ్రీ కొత్తగూడెం కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శించి పాఠ్యాంశాల్లో విద్యార్థుల ప్రావీణ్యం పరిశీలించారు జిల్లా కలెక్టర్ అంకిత్.వంటసాల తనిఖీ చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తుండగా ఆరవ తరగతిలో ఇంగ్లీష్ సబ్జెక్టు పై పాఠ్యాంశాల్లో ప్రావీణ్యం ఏ విధంగా ఉంది అని విద్యార్థులతో చదివించి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రణాళిక బద్ధంగా క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఇంగ్లీష్ తోపాటు అన్నీ సబ్జెక్టులల్లో రాణిచేలా కృషి చేయాలని ఉపాధ్యాయుడు హరిబాబుకు సూచించారు. అనంతరం పాఠశాలలో ఉన్న వంటశాలను పరిశీలించి 160 మంది విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలు కూర, పప్పు, అన్నం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న పథకంలో పౌష్టికాహారం అందిస్తుందని అవి విద్యార్థు లకు అందేలా పాఠశాల ప్రధానో పాధ్యాయులు లాలు రాథోడ్ చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలకు త్రాగునీరు వసతులు ఏమున్నాయని ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ తో పాటు బయటనుంచి మినరల్ వాటర్ విద్యార్థుల త్రాగునీరు కోసం అందుబాటులో ఉంచామని జిల్లా కలెక్టర్ కు తెలిపారు.

# పోలీస్ కొలువుల్లో గిరిజనులకు 75% రిజర్వేషన్ అమలు చేయాలి

## సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరుల లేఖ..

అశ్వాపురం సెప్టెంబర్ 18 (జనంసాక్షి):
ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థానిక ఆదివాసీ, గిరిజన నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, వెడ్మ బొజ్జు, రాందాస్ నాయక్‌లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎంకు లేఖ అందజేశారు.2026లో విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన పోస్టుల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయలేదని, దీనివల్ల స్థానిక గిరిజన నిరుద్యోగ యువతకు నష్టం జరుగుతోందని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు అసెంబ్లీలోనూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులు, స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు, గతంలో అమల్లో ఉన్న ప్రత్యేక నిబంధనలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుతం కొనసాగుతున్న పోలీస్ నియామక ప్రక్రియలోనే 75 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్యేక నిబంధనల అమలుకు డిమాండ్:
G.O.Ms.No.109, తేదీ 17.06.1988, అలాగే Gazette Notification No.49. తేదీ 10.05.2018 లో ఏజెన్సీ ప్రాంతాల్లో 75 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన నిబంధనలు ఉన్న విషయాన్ని సీఎంకు ఇచ్చిన లేఖలో ప్రస్తావించారు. రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీ ప్రాంతాల గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



బాక్స్ ఐటమ్:
పోలీస్ కొలువులపై గిరిజన యువత ఆశలు
75% రిజర్వేషన్ అమలుకు సీఎంకు లేఖ
ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థానిక గిరిజన యువతకు పోలీస్ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. 2026 పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.గతంలో ఉన్న ప్రత్యేక నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ప్రస్తుత నియామక ప్రక్రియలోనే రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిర్ణయం ఏజెన్సీ ప్రాంతాల స్థానిక గిరిజన నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించే అంశంతో ముడిపడి ఉందని వారు పేర్కొన్నారు.
పినపాకతో పాటు రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీ ప్రాంతాల యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ట్రయల్ రన్ చాలదు..

## తుమ్మలచెరువును గోదావరి నీటితో నింపాలి

### ట్రయల్ రన్‌తో సరిపెట్టకుండా 15 వేల ఎకరాల ఆయకట్టును ఆదుకోవాలి : రైతు సంఘం..

**అశ్వాపురం సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
తలాపున గోదావరి జలాలు ఉన్నప్పటికీ తుమ్మలచెరువు ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని అశ్వాపురం మండల రైతు సంఘం అధ్యక్షుడు బద్ధం సాంబిరెడ్డి అన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే రైతులకు సకాలంలో నీరు అందడం లేదని పేర్కొన్నారు.తుమ్మలచెరువు ఆయకట్టు కింద సుమారు 15 వేల ఎకరాలకు పైగా సాగు అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, నాట్లు పూర్తయిన సమయంలో కూడా నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గోదావరి జలాలను తుమ్మలచెరువుకు మళ్లిస్తామని హామీలు ఇచ్చి, తాత్కాలిక పైప్‌లైన్ ఏర్పాటు చేసి స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ నిర్వహించారే తప్ప చెరువును పూర్తిస్థాయిలో నింపలేదన్నారు.ట్రయల్ రన్‌తో రైతుల పొలాలు తడవవని, వెంటనే నీటిని విడుదల చేసి తుమ్మలచెరువును నింపాలని డిమాండ్ చేశారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు అందించి ఆదుకోవాలని బద్ధం సాంబిరెడ్డి కోరారు.

## ముమ్మరంగా రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు



**టేకులపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని టేకులపల్లి మండలంలో రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ముమ్మరంగా కొనసాగించారు. మండల రేషన్ డీలర్లు అసోసియేషన్ అధ్యక్షులు ఆంగోత్ సంతులాల్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా, ఈ సభ్యత్వ కార్యక్రమానికి రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఊకే శేఖర్ రావు పాల్గొని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు.ఈ కార్యక్రమంలో ఆదారేషన్ కలిగి ఉన్న ప్రతి రేషన్ డీలర్ల సభ్యత్వం తీసుకోవాలని,ఈ సభ్యత్వం వల్ల డీలర్ కుండే ఉపయోగాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అజ్మీర రామ, గుగులోతు హేమ్చందర్,గోగ్గల కళ్యాణ్,సోలం రాంబాబు పాల్గొన్నారు.

## హమారా ప్రసాద్‌పై UAPA చట్టం కింద చర్యలు తీసుకోవాలి

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్18 (జనం సాక్షి):**
భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు భారత రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయడం శుభపరిణామమని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం పేర్కొంది. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో శుక్రవారం స్వీట్లు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాల్వంచ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు తదితరులు ప్రసాద్‌ను సాధారణ సెక్షన్లతో వదిలిపెట్టకుండా, ఉంఖం-1967 చట్టం కింద యావజ్జీవ శిక్ష విధించి శాశ్వతంగా జైల్లోనే ఉంచాలని డిమాండ్ చేశారు. సమాజంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, టీజేఎస్, వివిధ ప్రజాసంఘాల నాయకులు నాగ సీతారాములు, జేబీ శౌరి, ఎర్రా కామేష్, మల్లెల రామనాథం, సలిగంటి శ్రీనివాస్, దాసరి రమేష్, కురిమెళ్ళ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉప సర్పంచ్-వార్డు సభ్యుల మధ్య రచ్చ

- ఇరువర్గాల ఫిర్యాదులు.. పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయతీ పంచాయతీ
- ఉప సర్పంచ్ ఎన్నికల డబ్బుల వ్యవహారమే అసలు కారణమా?






**మర్రిగూడ, సెప్టెంబర్ 18 (జనం సాక్షి)**
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం రాజాపేట తండా గ్రామపంచాయతీలో ఉప సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య నెలకొన్న వివాదం బహిర్గతమైంది. పరస్పరం దాడులు చేసుకున్నారంటూ ఇరువర్గాలు మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడంతో పంచాయతీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉప సర్పంచ్ కొర్ర సునీత తనపై వార్డు సభ్యుడు రాజు, అతని కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉప సర్పంచ్ ఎన్నిక సమయంలో తనకు మద్దతు ఇచ్చినందుకు వార్డు సభ్యులకు రూ.2 లక్షలు ఇచ్చామని, అదనంగా మరో రూ.లక్ష ఇవ్వాలని ఒత్తిడి తెచ్చి వేధింపులకు గురిచేశారని ఆమె ఆరోపించినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఎస్టీ చట్టంలోని నిబంధనల కింద కూడా కేసు నమోదైనట్లు తెలిసింది.

చర్చకు పిలిచి దాడి చేశారంటున్న వార్డు సభ్యులు మరోవైపు ఐదుగురు వార్డు సభ్యులు సర్పంచ్, ఉప సర్పంచ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్చిద్దామని సర్పంచ్ పిలవడంతో తాము వెళ్లామని, అక్కడ ముందస్తు ప్రణాళికతో తమపై దాడి చేశారని వారు ఆరోపించారు. ఈ ఘటనలో తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరినట్లు సమాచారం.

**వీడియోలు, ఆడియోలతో మరింత రచ్చ**
ఘటనకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఆడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే వాటి పూర్తి నేపథ్యం, వాస్తవికత, ఘటనకు దారితీసిన పరిస్థితులపై స్పష్టత రావాల్సి ఉంది. వైరల్ వీడియోలు, ఆడియోలను కూడా దర్యాప్తులో భాగంగా పరిశీలించాల్సి ఉంది.

**డబ్బులు ఇచ్చారా..? అదనంగా అడిగారా..?**
ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా రూ.2 లక్షలు ఇచ్చారన్న ఆరోపణలు, అదనంగా మరో రూ.లక్ష ఇవ్వాలని ఒత్తిడి చేశారన్న ఆరోపణలు ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి. మరోవైపు చర్చ పేరుతో పిలిచి తమపై దాడి చేశారన్న వార్డు సభ్యుల ఆరోపణలు కూడా తెరపైకి వచ్చాయి. ఇరువర్గాల ఆరోపణల్లో వాస్తవమెంత? అసలు వివాదానికి దారితీసిన కారణమేంటి? డబ్బుల వ్యవహారానికి సంబంధించిన ఆధారాలున్నాయా? అనే అంశాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ ఘటనపై మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మేతరీ శంకర్, వేణుగోపాల్‌రెడ్డి స్పందిస్తూ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గిరిజన మహిళా ప్రజాప్రతినిధికి రక్షణ కల్పించాలని కోరారు.

## పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలి



జాజిరెడ్డిగూడెం మండల **(జనంసాక్షి):** ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి జ్వరం సర్వే నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురుగునీటి నిల్వలను తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా థిమోపాస్ మందును పిచికారి చేయించారు. అలాగే వీధుల్లో, మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఏఎన్ఎం గిరిజ, ఆశా కార్యకర్త శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం



జాజిరెడ్డిగూడెం మండల **(జనంసాక్షి):** జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన నిమ్మశెట్టి నరేష్ భార్య రేణుక ఇటీవల మృతి చెందింది. దీంతో అదే గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ 2008 పదో తరగతికి చెందిన బ్యాచ్ విద్యార్థులు తమ తోటి విద్యార్థి నరేష్ కుటుంబానికి శుక్రవారం తమ వంతు సాయంగా రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న తమ బ్యాచ్ విద్యార్థులను ఆదుకుంటున్నట్లు స్నేహితులు తెలిపారు.

## వ్యవసాయ విద్యార్థులకు గ్రామీణ కృషి అనుభవం ఎంతో ముఖ్యం - కెవికె
### రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ డిగ్రీ విద్యార్థినులు



**గరిడేపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం రావే లో భాగంగా చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ, హైదరాబాద్ కు చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ విద్యార్థినులు పొనుగోడు గ్రామ పంచాయతీలో పర్యటించి గ్రామీణ వ్యవసాయ విధానాలు, స్థితిగతులను అధ్యయనం చేశారని కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్ తెలిపారు. గ్రామంలో నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సులో భాగంగా విద్యార్థినులు గ్రామస్తులతో ముఖాముఖి సంభాషించి వారు ఎదుర్కొంటున్న వ్యవసాయ సమస్యలను తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలను గ్రామ పటం, వెన్ డయాగ్రమ్, పై-చార్ట్, చిత్రాల రూపంలో ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని వనరులు, రైతుల వర్గీకరణ, జనాభా, భౌగోళిక పరిస్థితులు, నీటి వనరులు, దిగుబడులు, చీడపీడల నివారణకు పాటిస్తున్న యాజమాన్య పద్ధతులు వంటి అంశాలను చాట్ ద్వారా వివరించారు. అంతేకాకుండా రైతులకు ప్రకృతి వ్యవసాయం, సమగ్ర వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించి, ఒకే పంటపై ఆధారపడకుండా సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పొనుగోడు సర్పంచ్ వేణు , కేవీకే శాస్త్రవేత్తలు ఎ. కిరణ్, డి. ఆదర్శ్, ఎన్. సుగంధి, ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎ. నరేష్, ఏఈఓ మనోజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, బిల్ కలెక్టర్ సత్యనారాయణ, రైతులు దేవిరెడ్డి, వీరయ్య, ఆంజనేయులు మరియు విద్యార్థినులు రితిక, స్నేహవల్లి, సుచరిత, అనూష, దివ్య, వినయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## అలక నీలమ్మ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**నేరేడుచర్ల సెప్టెంబర్ 18( జనంసాక్షి) :**
మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డు నర్సయ్య గూడెం గ్రామానికి చెందిన అలక నీలమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి శుక్రవారం నీలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులు అలక సైదిరెడ్డి సరిత, నేరేడుచర్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు శ్రవణ్ రెడ్డిని కలిసి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నీలమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ నన్నెపంగ శ్రీనివాస్, 4వ వార్డు కౌన్సిలర్ కొణతం మంజుల, 8వ వార్డు కౌన్సిలర్ లావణ్య, 2వ వార్డు కౌన్సిలర్ యారవ లక్ష్మి, మాజీ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చులకూరి ప్రకాష్, చెరువు సంఘం చైర్మన్ యామిని వీరయ్య, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా జానలదిన్నె సెగ్రిగేషన్ షెడ్



**నేరేడుచర్ల సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
మండలంలోని జానలదిన్నె గ్రామ పంచాయతీలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్ ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని బిఆర్ఎస్ యూత్ నాయకులు తక్కెళ్ళ నాగార్జున ఆరోపించారు. శుక్రవారం షెడ్డును పరిశీలించి మాట్లాడుతూ గ్రామంలో చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి నిర్వహించాల్సిన ఈ షెడ్ వినియోగంలో లేకపోవడంతో, చెత్త రోడ్ల వెంబడి పేరుకుపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నయన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల దుర్వాసనలతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నూతనంగా నిర్మించిన షెడ్డును ఉపయోగించకుండా వదిలేయడం బాధాకరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడానికి పాలకవర్గం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సెగ్రిగేషన్ షెడ్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ నాగుల్ మీరా, మధు, శ్రీనివాస్, విజయ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు



**మేళ్లచెరువు ( జనంసాక్షి)**
మేళ్లచెరువు మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. మండల కేంద్రమైన మేళ్లచెరువులో గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయకుడు అందరిని ఆకట్టుకుంటుంది. శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి లక్ష్మీదేవికి సామూహిక కుంకుమార్చనలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాలకు హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రాసాదా సంతర్పణ కూడా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వరగాని నాగరాజు, ప్రధాన కార్యదర్శి కొప్పురావూరు విజయ శంకర్, కోశాధికారి వి డాల పురుషోత్తం, వర్కింగ్ ప్రెసిడెంట్ తూములూరి ఆదిత్యాలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి
### విద్యావేత్త, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్



**కోదాడ,( జనంసాక్షి)**
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి కాన్వెంట్‌లో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని విద్యావేత్త, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్ కోరారు. త్రివేణి డిగ్రీ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ... ఈ జాబ్‌మేళాలో 300కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఒకే వేదికపై పలు కంపెనీల్లో అవకాశాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలు, బయోడేటాతో జాబ్‌మేళాకు హాజరై అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. యువత భవిష్యత్తుకు ఈ జాబ్‌మేళా ఉపయోగపడుతుందని సిరికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు.

జనంసాక్షి

# భయానక శబ్దాలతో వికృత రూపం దాలుస్తున్న డిజేలు

- శబ్దకాలుష్యం తో గుండెలు బేజార్
- హృద్రోగులకు ప్రాణ సంకటంగా మారిన డీజే
- సాంప్రదాయవాయిద్యాలను మింగేస్తున్న ఢీజె మహమ్మారి

**పెనుబల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** అత్యంత జిగుత్సా కరంగా, భయానకంగా శబ్ద కాలుష్యాలను విడుదల చేస్తూ మనుషుల గుండెలను పిండేస్తున్నాయి ఈ మహమ్మారి ఢీ జేలు. ఇవి విడుదల చేసే వికృత శబ్దాలకు హార్ట్ పేషెంట్లు ఉలిక్కిపడుతున్నారు. ఒకరి మాట మరొకరికి వినపడదు, చెవులు చిల్లులు పడే శబ్దాలుకు , గుడ్డెద్దు చేలో పడ్డట్టే ఈ డీజెవ్యవహారం. తెలుగు ప్రజలుఆది నుండి అత్యంతభక్తి శ్రద్దలతోసంప్రదాయ నృత్యాలతో కోలాహలంగా జరుపుకొనే వినాయక చవితి, విజయదశమి పండగల సాంప్రదాయ నృత్యాలస్వరూపాలను వికృత రూపాలకు మారు పేరైన "ఢీజె "అనే నల్ల దెయ్యాలు మింగేస్తున్నాయి. ఒక్కప్పుడు సాంప్రదాయ మేళాలు సన్నాయి, డప్పు మేళాలతో సాంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో ఊరేగింపులు, బతుకమ్మ, అమ్మవారి ఊరేగింపులు చెవులకు విందుగా, కనుల పండగలా ఉండేవి, పండుగులు అప్పుడే అయిపోయాయా అన్నట్లుగా నృత్యాలు, వాయిద్యాలు ఊరేగింపులు ఉండేవి, ఇవి క్రమేపి కనుమరుగై పోయే పరిస్థితి దాపురించి విపరీతమైన,వికృతమైన, భయానక మైన శబ్దాలను విరజిమ్మే" ఢీజె " మహమ్మారీ అనే విష సంస్కృతి మొదలైంది, ఈ ఢీజేలు భయంకరమైన శబ్దాలను విడుదల చేస్తూ మనుషుల, పిల్లల గుండెలను పిండేసి, ఆపేస్తున్నాయి, గ్రామాల్లో చాలాచోట్ల ఢీజే శబ్దమహమ్మారికి చిన్నా పెద్ద తేడా లేకుండా ఎన్నో గుండెలు ఆగస్మాత్తుగా, అర్ధాంతరంగా ఆగి పోయి వారి కుటుంబ సభ్యుల్లో కుంపటి పెట్టాయి,అర్ధ రాత్రులు వికృత మైన, భయంకరమైన శబ్ద కాలుష్యాలను విదచిమ్ముతూ గ్రామాల్లో పగటి పూట అలసి పోయి నిద్ర పోతున్న గుండెల్నిఉలిక్కి పడెలా లేపి పిండి చేస్తు న్నాయి,దేవాలయాల సమీపంలో నివాసముంటున్న వారి పరిస్థితి మరీ నరక ప్రాయంగా మారింది, దేవాలయాల సమీపంలో నివాసముంటున్న ప్రజలు అదృష్టంగా భావించే వారు, ఇప్పుడు ఈ శబ్ద కాలుష్యా లకు బెంబే లెత్తి పోతున్నారు,ఢీ జె ల వికృతం రూపం,మంచి, చెడు,



ఏ కార్యక్రమమైన అక్కడ చేరిమనిషి కి మనిషికి మధ్య మాటలు లేకుండా కేవలం సైగల తోనే మాట్లాడు కొనే దుస్థితి కి తెచ్చాయి ఈ ఢీ జె వికృత శబ్దాలు, మరి ఇంత భయంకరంగా శబ్ద కాలుష్యా లను విడుదల చేస్తూ మనుషుల ప్రశాంతతాను హరించి వేస్తూ, మనుషుల గుండెలను పిండి వేస్తున్న ఈ ఢీ జె మహమ్మారులను శాశ్వతంగా నిరోదించాలని , పర్మిషన్ లు ఇవ్వకూడదని ప్రజలు కోరుకుంటున్నారు.



## గిరిజనుల 10 శాతం రిజర్వేషన్లకు నాలుగేళ్లు

### కేసీఆర్, మెచ్చా చిత్రపటాలకు గిరిజనుల పాలాభిషేకం

**చంద్రుగొండ, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా చంద్రుగొండ మండలానికి చెందిన గిరిజనులు, బంజారా సోదరులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్), మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు తెలిపారు.గిరిజనుల విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో గత ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లను అమలు చేసిందని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుతో గిరిజనులకు విద్య, ఉద్యోగ రంగాల్లో మరిన్ని అవకాశాలు లభించాయని వారు తెలిపారు. గిరిజనుల అభ్యున్నతికి అప్పటి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో చంద్రుగొండ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు, బంజారా సోదరులు తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గిరిజనుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వారు కొనియాడారు.

## జపాన్ పర్యటన పూర్తి చేసుకున్న ఉపాధ్యాయుడికి డీఈవో అభినందన

**గరిడేపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం తరపున సూర్యాపేట జిల్లా నుండి జపాన్ ఎక్స్‌పోజర్ విజిట్ కి వెళ్లిన ఉపాధ్యాయుడు చారుగుండ్ల రాజశేఖర్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వచ్చారు.సెప్టెంబర్ 5 నుండి 12 వరకు జరిగిన ఈ పర్యటనలో జపాన్ విద్యావిధానం, పాఠశాలల్లో ఐ సి టి వినియోగం, విద్యార్థుల్లో స్వీయ శుభ్రత పద్ధతులు, నూతన విద్యా దృక్పథాలను ఆయన అధ్యయనం చేశారు.గురువారం డిఇఓ కార్యాలయంలో డిఇఓ అశోక్ ని కలిసిన రాజశేఖర్ ను డీఈవో అభినందించారు. జపాన్ లో నేర్చుకున్న అంశాలను జిల్లా పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మారం పవిత్ర, తాళ్లూరి సాయి ఈశ్వరి, చారుగుండ్ల రాజశేఖర్ కలిసి డీఈవో అశోక్ ని సత్కరించారు.



## చేయూత పెన్షన్ పథకం లబ్ధిదారుల ఇంటింటి సర్వే

**హాలియా, జనం సాక్షి సెప్టెంబర్ 18:** హాలియా మున్సిపాలిటీ 9వ వార్డు పరిధిలో చేయూత పెన్షన్ పథకం లబ్ధిదారుల ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.నాగార్జున సాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి గారి ఆశీస్సులతో, హాలియా మున్సిపల్ చైర్మన్ శ్రీ చింతల చంద్రారెడ్డి గారి సహకారంతో, 9వ వార్డు కౌన్సిలర్ శ్రీ చెరుపల్లి ముత్యాలు గారి ఆధ్వర్యంలో ఈ సర్వే కొనసాగింది.ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి, వారి అర్హతలు, అవసరాలు మరియు సంబంధిత సమాచారాన్ని సేకరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



**కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు వ్యాఖ్యలు**

ఈ సందర్భంగా 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేస్తాము. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాము" అని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కోడుమూరి వెంకట్రాం రెడ్డి, వార్డు ఆఫీసర్ ఈశ్వరి, సొనగంటి సాయి చారి తదితరులు పాల్గొన్నారు.



## రైతాంగానికి కనీసం 16 గం.లు కరెంట్ అందించాలి

### మాద్గులపల్లి సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

**మాడుగులపల్లి సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** రైతాంగానికి కనీసం 16 గం.ల విద్యుత్ అందించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేవి రెడ్డి అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు ఈ సందర్భంగా శుక్రవారం మాద్గులపల్లి మండల కేంద్రములోని సబ్ స్టేషన్ ఎదుట రైతుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగానికి కరెంటు 24 గంటలు కాకుండా కనీసం 16 గంటలు కూడా ఇవ్వకుండా ఎనిమిది గంటలు ఏడు గంటల 30 నిమిషాలు మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు దీనివల్ల రైతులు అనేక ఇబ్బందులు గురిఅవుతారన్నారు ఇప్పటికే ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడుతుంటే మరోవైపు కరెంట్ కోతలు విధించడం అన్యాయమన్నారు కావున రైతాంగానికి కనీసం 16 గం.ల కరెంట్ ఇవ్వాలని కోరారు లేని పక్షంలో రైతుల ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు పుల్లెంల శ్రీకర్, దేవి రెడ్డి మల్లారెడ్డి,ఎలిజాల రమేష్, నారాయణ రెడ్డి,పందుగ నాగయ్య,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌కు మంత్రి పదవి దక్కాలని ప్రత్యేక పూజలుబొబ్బిలి నరేష్

**మాడుగులపల్లి సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం గంధ్రవానిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొబ్బిలి నరేష్, తన కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీ) శంకర్ నాయక్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు లభించాలని కోరుతూ ఈ పూజలు జరిపారు.ఈ సందర్భంగా బొబ్బిలి నరేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రాంతీయ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌కు మంత్రి పదవి దక్కితే ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు మాడుగులపల్లి మండలం అన్ని రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## వీది కుక్కలు కోతుల బెడద నుండి ప్రజలను కాపాడండి

**సంస్థాన్ నారాయణపురం సెప్టెంబర్ 18 ( జనంసాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణ పురం



మండలంలోని కొత్తగూడెం గ్రామపంచాయతీలో ప్రజలు వీధి కుక్కలు మరియు కోతుల బెడద వలన తీవ్ర ఇబ్బంది గురి అవుతున్నారు అని గ్రామంలోని యువత శుక్రవారం రోజు స్థానిక ఎంపీడీవో ప్రమోద్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో వీధి కుక్కలు కోతల వలన గ్రామ ప్రజలు చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురి అవుతున్నారని గతంలో కర్మ గూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని కుక్క కరవడం జరిగిందని, దీనిపై స్థానిక పాలకవర్గానికి గతంలో తెలుపగా గ్రామసభ నిర్వహించి చర్యలు తీసుకోవాలని, తీర్మానించిన ఏలాంటి చర్యలు తీసుకోలేదని, కాబట్టి వీది కుక్కలను కోతులను ఊరి నుండి తొలగించే ప్రయత్నం చేయాలని, గ్రామస్తులు స్థానిక ఎంపీడీవో కి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాచకొండ జంగయ్య, కొత్తగూడెం గ్రామపంచాయతీ రెండవ వార్డ్ సభ్యులు బాలగోని మల్లేష్, నాలుగో వార్డు సభ్యులు రొమ్ముల సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు బాలగోని మల్లేష్, మాజీ వార్డ్ సభ్యులు రాచకొండ లింగస్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బంగారక్క యాదగిరి పాల్గొన్నారు.

## మేళ్లచెరువులో కల్తీ పల్లీల దందా

మేళ్లచెరువు (జనంసాక్షి):మండలంలో కల్తీ పల్లీలు ( వేరుశెనగ గింజలు ) వ్యాపారం జోరుగా నడుస్తుంది. మేళచెరువు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎటువంటి లైసెన్సు లేకుండా దూర ప్రాంతాల నుండి బస్తాల ద్వారా పల్లీలు దిగుమతి చేసుకొని, ధనార్జన ధ్యేయంగా కల్తీ పల్లీలను వ్యాపారస్తులకు అంటగడుతున్నాడు. ఈ మోసం తెలియని వ్యాపారస్తులు అతని దగ్గర పల్లీలు కొంటున్నారు. కొంతమంది వ్యాపారులు తమకు కల్తీ సరుకు వద్దు అంటే బలవంతంగా కట్టబెడుతున్నాడని కొందరు వ్యాపారస్తులు ఆరోపించారు. ఈ వ్యక్తి సంవత్సరాలుగా ఈ దందా నడిపిస్తున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ఎటువంటి అనుమతులు లేకుండా, లైసెన్స్ లేకుండా వ్యాపారాన్ని దర్జాగా నడిపిస్తున్నాడు. ఇకనైనా ఆ వ్యాపారి ఆగడాలను నివారించాలని వ్యాపారస్తులు కోరుతున్నారు..

## ఘనంగా గణపతి పూజ, అన్నదానం



**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** పట్టణంలోని 19వ వార్డు శ్రీనగర్ కాలనీ వినాయక మండపంలో 23వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు అట్లూరి హరిబాబు మంజుల ఆధ్వర్యంలో గణపతి పూజ, అన్నదాన కార్యక్రమం భారీగా నిర్వహించారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, పట్టణ ఎస్ఐ నరేష్ హాజరై ప్రత్యేక పూజలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపయ్య అనుగ్రహంతోనే సమస్త శుభాలు కలుగుతాయని, విఘ్నాలను తొలగించి విజయాలను అందించే దేవుడు వినాయకుడని అన్నారు. ప్రతి ఏటా కులమతాలకు అతీతంగా ఈ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు దొంతిరెడ్డి పద్మ, కోల ఉదయభాను, జక్కుల మల్లయ్య, సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్, అమరబోయిన ఊహా సతీష్, 19వ వార్డు ఇంచార్జ్ ఎండి అజీజ్ పాషా, చిట్యాల అమర్నాథ్ రెడ్డి, భానోత్ రంగా, సాయి, నాగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## దండుమల్కాపూర్ గ్రామసభలో రసాభాస

### రూ.53.11 లక్షల రికవరీపై నిలదీసిన గ్రామస్తులు

**చౌటుప్పల్ సెప్టెంబర్ 18(జనంసాక్షి)** మండల పరిధిలోని దండు మల్కాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై గ్రామస్తులు అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీశారు. గతంలో గ్రామ పంచాయతీ నిధుల మళ్లింపు, అవకతవక˘లపై వచ్చిన ఆరోపణలపై డివిజనల్ పంచాయతీ అధికారి క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ విచారణలో రూ.53,11,653 మేర నిధుల నిబంధనలకు విరుద్ధంగా వాడినట్లు తేలడంతో, ఆ మొత్తాన్ని తక్షణమే రికవరీ చేయాలని డి.ఎల్.పి.వో గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాగా ఆదేశాలు వచ్చి ఇన్నాళ్లవుతున్నా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రికవరీ ఎందుకు చేయలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. పంచాయతీ నిధులకు సంబంధించిన ప్రతి పైసా లెక్కలను ప్రజల ముందు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగం వ్యవహారంలో బాధ్యులైన గ్రామ కార్యదర్శిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాధ్యుల నుంచి నిధులు రికవరీ చేసే వరకు ఊరుకునేది లేదన్నారు.

## ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### భద్రాద్రి జిల్లా వాసవి క్లబ్ గవర్నర్ చారుగుండ్ల శ్రీనివాస్



**చంద్రుగొండ, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసవి క్లబ్ గవర్నర్ చారుగుండ్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చంద్రుగొండ మండల వాసవి క్లబ్ అధ్యక్షుడు వివిఎన్ కుక్కడపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ చారుగుండ్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ శ్రీనివాస్ ప్రత్యేకంగా హాజరయ్యారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు విప్పర్ల వేణు శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. అనంతరం జాతీయ రహదారి వెంబడి మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో భారీ కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ చారుగుండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించిన వాసవి క్లబ్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలని, ముఖ్యంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తమ ప్రతిభను చాటాలని అన్నారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చీమకుర్తి రాజ మనోహర్, రీజినల్ చైర్మన్ ధూపకుంట్ల అనిల్ కుమార్, జోన్ చైర్మన్ చీమకుర్తి నాగరాజా తరుణ్, మండల వాసవి క్లబ్ కార్యదర్శి వివిఎన్ సంకా సునీల్ కుమార్, కోశాధికారి వివిఎన్ కుక్కడపు కుశల్ ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు సుగ్గల వెంకటేశ్వరరావు (బాబు), ఆర్యవైశ్యులు లగడపాటి రంగారావు, పసుమర్తి కిషోర్, కుక్కడపు కిరణ్, కుక్కడపు సాయి, కుక్కడపు గణేష్, చక్రధర్, చిట్లూరి సుధాకర్, ధారా రంజిత్, పద్మనాభుని కృష్ణారావు, కోదుమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

### - రెవెన్యూ సిబ్బందికి సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆదేశం



**భద్రాచలం సెప్టెంబర్ 18 (జనంసాక్షి)** సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో అధికారులను ఆశ్రయిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం, భద్రాచలం తహసీల్దార్ కార్యాలయంలోని వివిధ విభాగాలను ఆమె పరిశీలించారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యాలయ ప్రాంగణంలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పేరుకుపోకుండా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధులు సమర్థవంతంగా నిర్వహించి వారి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, డీటీ బాలకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ రామ్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేస్తే బ్లాక్‌లిస్ట్

### - మూడేళ్లపాటు టెండర్లలో పాల్గొనే అవకాశం ఉండదు

### - డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చందన

**భద్రాచలం సెప్టెంబర్ 18 (జనంసాక్షి)** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు నాణ్యమైన, తాజా కోడిగుడ్లనే సరఫరా చేయాలని డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చందన ఏజెన్సీ యజమానులను ఆదేశించారు. నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత ఏజెన్సీని మూడేళ్లపాటు ట్రైబల్ వెల్ఫేర్ సంస్థల టెండర్లకు దూరంగా ఉంచుతామని హెచ్చరించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో 50 ఆశ్రమ పాఠశాలలు, 14 వసతి గృహాలు, 22 పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు కోడిగుడ్ల సరఫరా కోసం టెండర్ ప్రక్రియ చేపట్టారు. జిల్లాకు చెందిన సుమారు ఐదుగురు ఏజెన్సీదారులు టెండర్లు దాఖలు చేశారు. తక్కువ ధర కోట్ చేసిన ఏజెన్సీలను కమిటీ పరిశీలించి నిబంధనల ప్రకారం ఎంపిక చేయనుంది. ప్రభుత్వ నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు తాజా కోడిగుడ్లను వారానికి మూడుసార్లు సరఫరా చేయాలని చందన సూచించారు. తనిఖీల్లో నాసిరకం సరుకులు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఖమ్మం, వైరా ఇన్‌చార్జి ఏటీడీవో తిరుపతిరావు, హెచ్ఎం హెచ్‌డబ్ల్యూఓ రాంబాబు, సిబ్బంది రామకృష్ణారెడ్డి, రంగయ్య, వీరభద్రం, పాండు, ఏజెన్సీ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



## మనువాద దాడిని ఖండించండి

### దాడిని నిరసిస్తూ కెవిపిఎస్ నిరసన




**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 18 ( జనం సాక్షి )** ఆర్ ఎస్ ఎస్ బీజేపీ మతోన్మాద ముసుగులో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డా బి ఆర్ అంబేద్కర్ పై హమారా ప్రసాద్ అనే మతోన్మాది 'కల్పిత నాయకుడు అంబేద్కర్' అనే పేరుతో బుక్ ను తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన దుశ్చర్య అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం స్థానిక ఎన్నెస్పీ క్యాంప్ గేట్ వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ పై హమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్తమాల ప్రసాద్, నందిపాటి మనోహర్ లు మాట్లాడుతూ ఆర్ ఎస్ ఎస్ బీజేపీ కనుసన్నలలో ఉద్దేశ పూర్వకంగానే దళితులపైన, మహిళలపైన, మైనార్టీలపైన బిజెపి పాలిత రాష్ట్రాల్లో యదేచ్ఛగా దాడులు, హత్యలు, అత్యాచారాలూ కొనసాగుతున్నా యని అంతటితో ఆగకుండా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పై మనువాద ముసుగులో కల్పిత రాతలు రాయిస్తున్నారని వారు దుయ్యబట్టారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగం యొక్క మూల స్థంభాలైన లౌకికవాదం, సమైక్యవాదం, ఆర్థిక, సామాజిక న్యాయం వంటి మౌలిక అంశాలపై దాడిని ముప్పేట కొనసాగిస్తూ తన మనువాద ఎజెండాను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నదని వారు విమర్శించారు. అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలతో బుక్ ముద్రణకు పాల్పడిన హమారా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణ, నగర నాయకులు రేడపంగి ప్రకాష్, సుభాష్ పివాల్, చెరుకుపల్లి వీరభద్రం, గుమ్మడి బిక్షం, హెచ్ వెంకటేశ్వర్లు, సిద్దెల రాజు, మాచర్ల గోపాల్, జె వెంకన్న బాబు, జిల్లా ఉపేందర్, రాందాస్, ఆరేంపుల సురేష్, రామకృష్ణ, స్వామి, నాగేశ్వరరావు, రాంబాబు, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనం భూమి ఆక్రమణకు యత్నం

### ప్రభుత్వ భూమిని కాపాడే ప్రయత్నంలో అధికారులు

### ఎన్. ఎస్.పీ. భూమిలో పల్లె ప్రకృతి వనం



**పెనుబల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** పల్లె ప్రకృతి వనాలు పర్యవేక్షణ లేక నిరాదరణకు గురవుతున్నాయి. పెనుబల్లి మండలం వంగా ముత్యాల బంజర గ్రామపంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంకు కేటాయించిన ఒక ఎకరం ప్రభుత్వ భూమిని కాపాడటం అధికారులకు తలకు మించిన పనిగా మారింది. నాగార్జున సాగర్ ఎడమ కాలువ పక్కన ఉన్న ఎకరం భూమిలో 2020లో పల్లె ప్రకృతి వనాన్ని ప్రారంభించారు. ఎడమ కాలువ పొడవునా ఇరువైపులా సుమారు 100 అడుగుల ఎన్. ఎస్.పీ. భూమి ఉంది. అలా ఉన్న భూమిలో పల్లె ప్రకృతి వనాన్ని పెంచాలని అప్పటి జిల్లా కలెక్టర్ కర్ణన్ నిర్ణయించారు. ఆనాడు ప్రతి పల్లె ప్రకృతి వనానికి సుమారు మూడు లక్షల రూపాయలకు పైగానే నిధులు వెచ్చించి వివిధ రకాల మొక్కలు నాటారు. మొక్కల నిర్వహణకు కూడా నెల వారిగా వేతనం చెల్లిస్తూ కార్మికులను నియమించారు. అలా పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం వీ.ఎం.బంజర లోని ప్రకృతి వనంలో పెరిగిన చెట్లు కూడా కనిపించడం లేదు. చుట్టూ ఫెన్సింగ్ ఉండి చదునుగా ఉన్న భూమిలో షెడ్డు నిర్మించేందుకు కొందరు ప్రయత్నించారు. గ్రామస్థులు కొందరు అధికారులకు సమాచారం ఇవ్వగా ఇన్ చార్జీ ఎంపీడీఓ వీరస్వామి, గ్రామపంచాయతీ కార్యదర్శి, నీటిపారుదల శాఖ అధికారులు ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ షెడ్ నిర్మాణానికి ఇసుక, సిమెంట్ఇటుకలు, కంకరు కనిపించడంతో అధికారులు అవాక్కయ్యారు. ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి ప్రభుత్వ స్థలాన్ని కాపాడే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు.



## వినాయక నిమజ్జన ఏర్పాట్లపై స్థల పరిశీలన

**ఆత్మకూరు (ఎం) జనంసాక్షి :**

వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ శుక్రవారం రోజున నిమజ్జనం నిర్వహించనున్న చెరువు వద్ద స్థలాన్ని పరిశీలించి, భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను శుభ్రం చేయించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సిబ్బందికి సర్పంచ్ సూచించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబోజు శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## చేయూత పెన్షన్స్ వెరిఫికేషన్

**నూతనకల్ సెప్టెంబర్ 18(జనంసాక్షి)**

మండల వ్యాప్తంగా అధికారులు చేయూత పెన్షన్స్ వెరిఫికేషన్ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం యడవల్లి గ్రామ పంచాయతీ లో ఎంపీడీఓ సునీత పర్యవేక్షించి పరిశీలించారు. మండల వ్యాప్తంగా 888 దరఖాస్తులు రాగ వంటరి మహిళా 76,వితంతువు 437,డిసబుల్ 161,చేనేత 27,గీత కార్మికులు 187 దరఖాస్తులు వచ్చాయి అని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ సరిత కృష్ణ యాదవ్, పంచాయతీ కార్యదర్శి చల్లమయ్య, బయ్యా గంగయ్య పాల్గొన్నారు.

## సూర్యాపేట అభివృద్ధికి బుల్లెట్ ట్రైన్ ఎంతో అవసరం

**సూర్యాపేట(జనంసాక్షి):**

సూర్యాపేట అభివృద్ధికి బుల్లెట్ ట్రైన్ ఎంతో అవసరమని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యామ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్ కోసం అఖిలపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ కార్యక్రమానికి మెడికల్ షాపుల నిర్వాహకులు పూర్తి మద్దతు ప్రకటించి బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేయడం వల్ల జిల్లాకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం చేపడుతున్న ప్రజా ఉద్యమానికి తమ సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముషం హరిప్రసాద్, కార్యదర్శి ఊట్కూరు సైదులు, కోశాధికారి చామకూరి లింగయ్య, సభ్యులు ఎండి రఫీ, పణి, వెంకన్న, కృష్ణ, సోమ ప్రవీణ్, రాము, మోహన్ తదితరులు పాల్గొన్నారు.





## రైతుల కష్టాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

### వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి

**చౌటుప్పల్ సెప్టెంబర్ 18(జనంసాక్షి)**

రైతుల కష్టాలను తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం బండరావిరాల గ్రామం వద్ద పిలాయిపల్లి కాలువలో రూ.20 లక్షల వ్యయంతో గుర్రపుడెక్క తొలగింపు పనులను ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బండరావిరాల నుంచి పెద్ద కాపర్తి వరకు కాలువలో గుర్రపుడెక్క తీవ్రంగా పేరుకుపోవడం వల్ల చివరి ఆయకట్టు వరకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను స్థానిక రైతులు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా దివిస్ లేబరేటరీస్ యాజమాన్యంతో మాట్లాడి తమ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.20 లక్షలను తక్షణమే మంజూరు చేయించారని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, దివిస్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాధాకృష్ణ, డిఈ కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమిడి ప్రదీప్, పోచంపల్లి సింగిల్ విండో చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, జూలూరు సింగిల్ విండో చైర్మన్ కళ్లెం రాఘవరెడ్డి, వైస్ చైర్మన్ చెన్నగొని అంజయ్య గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయ దేవేందర్, ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, సర్పంచులు తీగుళ్ల చంద్రయ్య, కాసుల అంజయ్య గౌడ్, పెరుమాండ్ల మహాలక్ష్మి దానయ్య, మాజీ ఎంపీటీసీ బద్దం కొండల్ రెడ్డి, నాయకులు నల్ల నరేందర్ రెడ్డి, ఢిల్లీ శేఖర్ రెడ్డి, చేవెళ్లి కృష్ణ, దివిస్ ప్రతినిధి గోపి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి ఒడిలో కొలువైన విఘ్నేశ్వరుడు

### ప్రకృతి అందాల మధ్య గణనాథుడి వైభవం - ఊడల అలంకరణ ప్రత్యేక ఆకర్షణ గా బ్యాంకు కాలనీ గణపయ్య

**ఆత్మకూరు (ఎం) జనంసాక్షి**

వినాయక చవితి సందర్భంగా మండలం లో ని బ్యాంకు కాలనీ వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వినాయకుడి విగ్రహం భక్తులను విశేషంగాఆకట్టుకుంటోంది. సుందరంగా అలంకరించిన గణనాథుడి వెనుక భాగంలో వేలాడుతున్న మర్రిచెట్టు ఊడలను పోలిన సహజసిద్ధమైన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విగ్రహం చుట్టూ పచ్చనిఆకులు, కొమ్మలు, వేలాడే ఊడలతో రూపొందించిన అలంకరణ ప్రకృతి?దైవత్వాల సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తోంది. భారతీయ సంప్రదాయంలో మర్రిచెట్టుకు విశిష్ట స్థానం ఉంది. దాని కొమ్మల నుంచి కిందకు పెరిగే ఊడలు నేలను చేరి కొత్త కాండాలుగా మారడం వల్ల, మర్రిచెట్టు విస్తరణ, స్థిరత్వం, దీర్ఘాయువుకు ప్రతీకగా భావించబడుతుంది. వినాయక చవితి ఉత్సవాల్లో అలంకరణల్లో ఆకులు, పూలు, ఇతర వృక్ష భాగాలనుఉపయోగించే సంప్రదాయాలకు కూడా చారిత్రక ఆధారాలు ఉన్నాయి."ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్ తరాలకు పచ్చని వారసత్వం" అనే సందేశాన్ని చాటుతూ ఈ వినాయకుడి అలంకరణ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బ్యాంకు కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బొబ్బలి అంజిరెడ్డి, గౌరవ అధ్యక్షులు పంజాల రామకృష్ణ గౌడ్, ఉపాధ్యక్షుడు గుండెగాని ఐలయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి బూడిది శేఖర్ గౌడ్ , కోశాధికారి జక్క కొండల్ రెడ్డి యూత్ కమిటీ అధ్యక్షులు సంతోష్ కుమార్ ఉపాధ్యక్షులు గుండెగాని కిరణ్ గౌడ్ మొలుగురి కరుణాకర్ రాచమల్ల రవి తదితరులు పాల్గొన్నారు.



## బుల్లెట్ ట్రైన్ పాత అలైన్మెంట్ నే కొనసాగించాలి

### మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

సూర్యాపేట (జనంసాక్షి):



బుల్లెట్ ట్రైన్ పాత అలైన్మెంట్ నే కొనసాగించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేటలో జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ ఏర్పాటు సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత అలైన్మెంట్ తెలంగాణకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. ఫ్యూచర్ సిటీ నుండి బుల్లెట్ ట్రైన్ మార్గం ప్రతిపాదించడం ఎవరి కోసమని ప్రశ్నించారు. చౌటుప్పల్ , సూర్యాపేట, కోదాడ మీదుగా రైలు మార్గం ఉంటే నల్లగొండ , వరంగల్ , ఖమ్మం జిల్లాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. జనం లేని మార్గంలో సీఎం కొనుక్కున్న భూముల కోసం రైల్వే లైన్ తీసుకెళ్లడం ఆయనతో పాటు ఆంధ్రాకు లాభం చేయడమేనని అన్నారు. సకల జనుల ఆకాంక్ష మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత అలైన్మెంట్ యాదాతథంగా కొనసాగించాలని కోరారు. ఎన్ హెచ్ 65 హైద్రాబాద్ నుంచి విజయవాడ రహదారికి సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ కేటాయించేవరకు ఉద్యమాలు ఉధృతం కొనసాగిస్తామని తెలిపారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని రంగాల ప్రజలు స్వచ్ఛందంగా బంద్ ప్రకటించి ,ర్యాలీలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. సూర్యాపేట ప్రజలందరి ఆకాంక్ష మేరకు స్థానిక శాసనసభ్యునిగా జేఏసీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో తన వంతుగా మద్దతు ఉంటుందని తెలిపారు.

## నూకల జానకి మృతి అత్యంత బాధాకరం

### -కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి

**హుజూర్ నగర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :**



తెలంగాణ ఉద్యమ మహిళ సంఘం హుజూర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షురాలు, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు నూకల జానకి మృతి చెందడం అత్యంత బాధాకరమని కోదాడ ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టిమేట్ కమిటీ చైర్మన్ నలమాద ఉత్తమ్ పద్మావతి అన్నారు. హుజూర్ నగర్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నూకల నరేందర్ రెడ్డి సతీమణి నూకల జానకి ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో వారి నివాసానికి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి నివాళు లర్పించారు. నూకల నరేందర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, పట్టణ అధ్యక్షులు గెల్లి రవి, టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు, రాజా రమేష్, విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

### ఎలాంటి అనుమతులు లేకుండా కోళ్లఫారం నిర్మాణ పనులు

### పనులు నిలిపివేయాలంటూ కాజీపేట గ్రామప్రజల ఆందోళన

**బొమ్మలరామారం సెప్టెంబర్ 18 (జనంసాక్షి)**



మండలంలోని కాజీపేట్ గ్రామంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ఉపసర్పంచ్ రామిడి శ్రీకాంత్ రెడ్డి గ్రామ పంచాయితీ పరిధిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కోళ్లఫారం నిర్మాణం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని వాపోయారు. గ్రామ పాలకవర్గ సభ్యుడే ఇలా అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై గ్రామ ప్రజలు తీవ్రంగా మండిపడ్డారు. గ్రామపంచాయతీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం ఇతర గ్రామ దేవతల దేవాలయాల నిర్మాణం కోసం గ్రామ అభివృద్ధి పనుల కోసం సేకరించిన ఇసుకను సొంత అక్రమ కట్టడాలకు వాడుకున్నట్లు తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్న ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి పై చట్టరీత్యా చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు.



# పిల్లాయిపల్లి కాలువలో పూడికతీత పనులు ప్రారంభం

## 30 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
మండలంలోని పిల్లాయిపల్లి కాలువలో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిల సహకారంతో, చౌటుప్పల్ డివీఎస్ లేబరేటరీస్ సీఎస్ఆర్ నిధుల ద్వారా సుమారు రూ.20 లక్షల వ్యయంతో బండరావిరాల పిల్లాయిపల్లి నుంచి పెద్దగాపర్తి వరకు 48 కిలోమీటర్ల మేర పనులు చేపట్టారు. నెల రోజుల్లో పనులను పూర్తి చేసి రైతులకు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ పనులతో సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ రాధాకృష్ణ, డీఈ కృష్ణారెడ్డి, డీవీఎస్ కంపెనీ ప్రతినిధి గోపి, భూదాన్ పోచంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు పాక మల్లేష్ యాదవ్, పిల్లాయిపల్లి సర్పంచ్ పెరుమాళ్ల మహాలక్ష్మి దానయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కాసుల అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ విద్యార్థులకు రావే కార్యక్రమం ఎంతో ముఖ్యం - కేవీకే శాస్త్రవేత్త కిరణ్

**గరిడేపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం (రావే) లో భాగంగా చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ, హైదరాబాద్ కు చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ విద్యార్థినులు పొనుగోడు గ్రామంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ పి ఆర్ ఏ కార్యక్రమాన్ని నిర్వహించారని కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ తెలిపారు.పొనుగోడు గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సులో విద్యార్థినులు గ్రామస్తులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ పటం, వెన్ డయాగ్రమ్, పై చార్ట్, చిత్రాల రూపంలో ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు.గ్రామ వనరులు, రైతుల వర్గీకరణ, జనాభా, నీటి వనరులు, దిగుబడులు, చీడపీడల నివారణ పద్ధతులపై చార్టుల ద్వారా వివరించారు. రైతులు ఒకే పంట కాకుండా సమగ్ర వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటకం వేణు, కేవీకే శాస్త్రవేత్తలు ఎ.కిరణ్, డి.ఆదర్శ్, ఎన్.సుగంధి, ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎ.నరేష్, ఏఈవో మనోజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, బిల్ కలెక్టర్ సత్యనారాయణ, రైతులు దేవిరెడ్డి, వీరయ్య, ఆంజనేయులు, విద్యార్థినులు రితిక, స్నేహవల్లి, సుచరిత, అనూష, దివ్య, వినయశ్రీ పాల్గొన్నారు.

# ఎస్ఆర్కెలో వైభవంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

## భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

## నేడు మహా అన్నదాన ప్రసాద పంపిణీ

**నేరేడుచర్ల సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
పట్టణంలోని ఎస్. ఆర్.కె అపార్ట్మెంట్ లో వరుసగా ఆరవ వార్షిక గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.అపార్ట్మెంట్ లో 42 ఫ్లాట్ల యజమానులంతా ఒకే కుటుంబంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఇరువురు దంపతులు పీటలపై కూర్చుంటుండగా వేద పండితులు ఇరువంటి శ్రీపాద శర్మ స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా 5వ రోజు శుక్రవారం లక్ష్మి గణపతి పూజ ను సాంప్రదాయ బద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పూజలలో కూర్చున్నారు. ఈనెల 19 న మహా అన్నప్రసాదం పంపిణీ చేసేందుకు అపార్ట్మెంట్ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు.అపార్ట్మెంట్ కమిటీ అధ్యక్షులు బోనగిరి అంజయ్య, చిత్తనూరు రామకృష్ణ, అరబండి కిరణ్ కుమార్, సుంకరి క్రాంత్ కుమార్,కందిబండ హరిప్రసాద్, యాగా శ్రీనివాస రావు,రాచకొండ శ్రీనివాసరావు, రావులపల్లి రోశయ్య, కురువెళ్ల రవి, శ్రీరామ్ తరుణ్, కంది బండ కిరణ్, శానం నరసయ్య, ఆదినారాయణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

# ఎనబై ఏళ్లుగా విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎస్టీయూ నాయకులు



**గరిడేపల్లి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి):**
ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షిస్తూ ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిలో, విద్యా వ్యవస్థ ఆధునీకరణకు 80 సంవత్సరాలుగా కృషి చేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ అని రాష్ట్ర నాయకులు రామిశెట్టి శ్రీనివాసరావు, గరిడేపల్లి మండల ఎస్టీయూ అధ్యక్ష కార్యదర్శులు మీసాల నరసింహారావు, గొర్రె నాగరాజు అన్నారు.గరిడేపల్లి మండలంలోని వెలిదండ, రాయినిగూడెం ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 27న హైదరాబాద్ లో జరగనున్న ఎస్టీయూ 80 వసంతాల వైభవోత్సవం పోస్టర్ ను వారు ఆవిష్కరించారు.భారత స్వాతంత్ర్యానికి పూర్వమే ఎస్టీయూ ఆవిర్భవించిందని, 80 ఏళ్లుగా నిర్విరామంగా ఉపాధ్యాయుల సర్వీస్ అంశాలలో అనేక మార్పులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఆర్.లక్ష్మయ్య, సివి రావు, జానకి రెడ్డి, రంగయ్య, సక్రు, శశికళ, శాంత తదితరులు పాల్గొన్నారు.

# కీతవారిగూడెంలో చేయూత పింఛన్లపై క్షేత్రస్థాయి విచారణ



**గరిడేపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
కీతవారిగూడెం చేయూత పింఛన్లకు సంబంధించి అర్హుల జాబితాలో పేర్లపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా వితంతు, వికలాంగుల పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలిస్తున్నారు. దరఖాస్తుదారుల కుటుంబ పరిస్థితులు, సంబంధిత పత్రాలు, అర్హత ప్రమాణాలను పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు.విచారణ అనంతరం అర్హత ఉన్న వారికి పింఛన్లు మంజూరు అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



# చిన్నపిల్లల వినాయకుడికి నిధుల కోత స్థానిక నాయకుల వైఖరిపై విమర్శలు

**మాడుగులపల్లి సెప్టెంబర్ 18 (జనం సాక్షి ):**
మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతిష్టించిన వినాయక విగ్రహానికి ?5,116ల ఆర్థిక సాయం అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రకటించిన హామీ కల్వలపాలెం గ్రామంలో వివాదాస్పదంగా మారింది మాడుగులపల్లి మండలం కల్వలపాలెం గ్రామంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో చిన్నపిల్లల పట్ల తీవ్ర వివక్ష చూపారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు గ్రామంలో మొత్తం ఐదు వినాయక విగ్రహాలను ప్రతిష్టించగా, నాలుగు విగ్రహాలకు మాత్రమే ఆర్థిక సాయం అందించి, చిన్నపిల్లలు ఎంతో అంగరంగ వైభవంగా ప్రతిష్టించిన విగ్రహానికి మాత్రం నగదు ఇవ్వలేదు ఈ పరిణామంతో తీవ్ర మనస్తాపం చెందిన చిన్నారులు మాకు ఓటు హక్కు లేదు కాబట్టే డబ్బులు ఇవ్వలేదు అని కన్నీటిపర్యంతమయ్యారు మనస్తాపానికి గురైన పిల్లలు నవరాత్రులు ముగియకముందే, 5వ రోజే వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని నిర్ణయించుకున్నారు దేవుడితో సమానమైన పిల్లల పట్ల స్థానిక నాయకులు ఇలా ప్రవర్తించడం సరికాదని గ్రామస్తులు తీవ్రంగా ఖండించారు ఎమ్మెల్యే నిధులు కేటాయించినప్పటికీ, స్థానిక నాయకులు కుట్రపూరితంగా పిల్లల విగ్రహానికి అందకుండా చేశారని ఆరోపించారు కాగా, ఈ సంఘటనతో చలించిపోయిన చిట్యాల సుగుణాకర్ అనే వ్యక్తి చిన్నారులకు తక్షణ సాయంగా ?2,000 ఆర్థిక సాయం అందించారు సుగుణాకర్ చూపిన ఉదారతకు గ్రామ ప్రజలు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

# గ్రంథాలయాల నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించాలి

నేరేడుచర్ల సెప్టెంబర్ 18 (జనంసాక్షి):
పట్టణంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని బిఆర్ఎస్ నాయకులు రాపోల్ నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ ముందు మాట్లాడారు.గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు ఉండే గదులు మాత్రమే కావని,జ్ఞానానికి నిలయాలుగా యువత భవిష్యత్తుకు బాటలు వేసే కేంద్రాలు అన్నారు.పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఖరీదైన పుస్తకాలు,కోచింగ్ సౌకర్యాలు అందుబాటులో లేకపోయినా,గ్రంథాలయాలు వారికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు పుస్తకాలు,పత్రికలు, ప్రశాంతమైన చదువు వాతావరణం అవసరమన్నారు. అలాంటి జ్ఞాన భాండాగారాలు మూసి ఉంటే నష్టపోయేది చదువుకునే యువత అన్నారు. వెంటనే గ్రంథాలయాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ యస్ నాయకులు తకెళ్ళ నాగార్జున,షేక్ నాగుల్ మీరా, పత్తిపాక రమేష్,గౌతమ్,వాస విజయ్ బోస్ తదితరులు పాల్గొన్నారు.




# వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి



**సూర్యాపేట (జనంసాక్షి):**
ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల ఝాన్సీ రమేష్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని 43వ వార్డు నెహ్రూ నగర్ లో వీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వేముల పవన్ కళ్యాణ్ లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.గత పది సంవత్సరాలుగా వీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు.వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు.అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని అన్నారు.ఈ కార్యక్రమంలో విగ్రహ దాత వేముల వీరబాబు మల్లీశ్వరి, సహకార దాతలు, యూత్ సభ్యులు, నాయకులు,
వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు క్లస్టర్‌లో పంటల క్షేత్రస్థాయి పరిశీలన




**ఆత్మకూరు (ఎం) జనంసాక్షి**
మండల క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఃఖీఎఐ భువనగిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి. శ్రీలత, ఐఎఐ కంపసాగర్ శాస్త్రవేత్తలు రాములమ్మ, స్వాతి ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలోని ప్రధాన పంటలైన వరి, పత్తి, కంది, ఆముదం పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా పంటల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమగ్ర సస్యరక్షణ చర్యలు, తెగుళ్లు మరియు పురుగుల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలు తగిన సూచనలు అందించారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలను గుర్తించిన వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులు లేదా శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాతుపాటి శ్రీనివాసులు, ఆత్మకూరు వ్యవసాయ విస్తరణ అధికారి బి. రాజశేఖర్‌తో పాటు రైతులు మజ్జిగ అశోక్, పి. మోహన్ రెడ్డి, కె. బీరయ్య, యాస రవి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్ నగర్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

## కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి



**గరిడేపల్లి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి):** గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న హుజూర్ నగర్ నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్ జి ఎఫ్ అండర్-14, అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలను గురువారం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైన ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పానుగోతు చత్రు నాయక్, సర్పంచులు, పీడీలు, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు. అండర్-17 లో ప్రథమ మఠంపల్లి, ద్వితీయ గరిడేపల్లి, అండర్-14లో ప్రథమ నేరేడుచర్ల, ద్వితీయ గరిడేపల్లి జట్లు విజయం సాధించాయి.

# గాంధీజీ లో నల్లగొండ భరోసా సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

○విద్యార్థులు సైబర్ మోసాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

○మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు



**చండూరు, సెప్టెంబర్ 18 (జనంసాక్షి)** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం చండూరు మున్సిపల్ కేంద్రంలోని గాంధీజీ విద్యాసంస్థల్లో నల్లగొండ భరోసా సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలు, సైబర్ భద్రత, సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మహిళలు, పిల్లలపై జరిగే వేధింపుల నివారణకు భరోసా సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని ధైర్యం చెప్పారు. భరోసా సెంటర్ కో-ఆర్డినేటర్, కౌన్సిలర్ జి. నళిని విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. సోషల్ మీడియాను ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. చట్టాలు, సైబర్ భద్రత, ఆన్‌లైన్ వేధింపుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో సహాయం కోసం 100, 1098 నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ జాని, పులిపాటి రాధిక, భరోసా మెడికల్ ఆఫీసర్ నిరోష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచిత పశు వైద్య శిబిరం మందుల పంపిణీ

**మాడుగులపల్లిసెప్టెంబర్ 18 (జనంసాక్షి):** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఇసుకబావిగూడెం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లూరి అనిత తమ సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన పశువుల బోను (ట్రేవిస్)ను ప్రారంభించారు ఈ ఉచిత వైద్య శిబిరంలో పశువైద్య బృందం 35 గేదెలకు వివిధ రకాల వ్యాధులను గుర్తించి తగిన వైద్య సేవలు అందించగా, 30 దూడలకు నట్టల నివారణ మందులను వేశారు ఈ కార్యక్రమంలో మాడుగులపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ , జూనియర్ వెటరినరీ ఆఫీసర్ రవిచందర్, గోపాల మిత్ర నరేందర్, సిబ్బంది రాకేష్ పాల్గొన్నారు అలాగే ప్రముఖ వెటరినరీ ఫార్మా సంస్థలైన ఇంటాస్, విర్బాక్, అలంబిక్ మరియు నేచురల్ రెమెడీస్ ప్రతినిధులు వెంకట్ రెడ్డి, కిరణ్, పరమేష్ హాజరై పాడి రైతులకు ఉచితంగా పశు ఔషధాలను పంపిణీ చేశారు.





జిల్లా విద్యాధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన బి స్మార్ట్ జిల్లా కమిటీ

**భువనగిరి,సెప్టెంబర్ 18(జనంసాక్షి)** బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కొండూరి మల్లేశం గౌడ్, కోశాధికారి సింగిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు తీగల జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆకోతుల కీర్తి జిల్లా విద్యాధికారి భిక్షపతిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి స్మార్ట్ జిల్లా బీబీనగర్ మండల అధ్యక్షులు కోణార్కరావు, కాశీ విశ్వనాథ్, మంజు బాబా, తదితరులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో

# అన్న ప్రసాద వితరణ కార్యక్రమం

**తుర్కపల్లి ,సెప్టెంబర్ 18( జనంసాక్షి)** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా శ్రీ రుద్ర సేన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుని వద్ద ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సమేతంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ సోమల వెంకటేష్ హాజరై అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు .సమాజంలో సేవా భావాన్ని పెంపొందించేందుకు యువత ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితుడు రమాకాంత్ శర్మ, బండారి శ్రీను, రొయ్యల మధు, పాముల బాలకృష్ణ గౌడ్, పాముల రాజు గౌడ్ ,బోయిని శశి కుమార్, ఆకుల బాలరాజు, బండ్ర సాయి కృష్ణ, బండ్ర ప్రశాంత్, ఎడపల్లి ప్రశాంత్, ఎడపల్లి రాజు, నాగపురి సాయిరాం , తదితరులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల చదువుకు బల్ రెడ్డి ఫౌండేషన్ చేయూత



**తిరుమలగిరి (సాగర్) , సెప్టెంబరు 18 (జనంసాక్షి):** పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమలగిరి సాగర్ మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 4వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా గురుకుల ప్రవేశ పరీక్ష మెటీరియల్‌ను పంపిణీ చేశారు. శిల్పాపూర్ ప్రాథమిక పాఠశాలలో 20 మంది, తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో 14 మంది, అల్వాల ప్రాథమికోన్నత పాఠశాలలో 10 మంది, కొంపెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 13 మంది విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా పల్‌రెడ్డి ఫౌండేషన్ మెంబర్ కన్వీనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురుకుల ప్రవేశాలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రత్యేకంగా రూపొందించిన మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పెండెం బిక్షం కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి



**గరిడేపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** అ ప్ప న్న పే ట గ్రామానికి చెందిన కోదాడ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పెండెం వెంకటేశ్వర్లు తండ్రి పెండెం బిక్షం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి శుక్రవారం అప్పన్నపేట గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబంలో పెద్దను కోల్పోవడం తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి, మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, కటకం రమేష్, సర్పంచులు గుండు రామాంజిగౌడ్, కటకం వేణు, నందిపాటి కవిత, జానయ్య, మాజీ సర్పంచ్ ఎడవెల్లి చంద్రారెడ్డి, నాయకులు సత్యనారాయణ, బిక్షం, పరమేష్, ఎస్.కె చాంద్, ఎడవెల్లి బాలసైదులు, బత్తిని అంజయ్య, పెండెం మహేష్, వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.